క్లుప్తంగా

26న చలో కలెక్టరేట్
కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు బాసటగా ఉన్న ప్రభుత్వ భవనాలలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచి కాస్మొటిక్ బిల్లులు విడుదల చేయాలన్నారు. డిగ్రీ, పీజీ కామన్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు రాహుల్, రవి, జిల్లా నాయకులు మోహన్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా కార్యక్రమాలపై అవగాహన

ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ప్రజలకు స్వచ్ఛతా కార్యక్రమాలపై అవగాహన ఉండాలని వైవీయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య పేర్కొన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్–9 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డా. రెడ్డయ్య మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వచ్ఛ భారత్ కోసం అందరూ కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.కె. శ్రీనివాసరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించాలి
కడప వైఎస్ఆర్ సర్కిల్: అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై చర్చించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ కోరారు. నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్‌పై మాట్లాడాలన్నారు. డీఎస్సీ, గ్రూప్స్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు నిరాశతో ఉన్నారన్నారు. వేల రూపాయలు ఖర్చు చేసుకని యువత కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారన్నారు. తక్షణమే అసెంబ్లీ సమావేశాలలో నిరుద్యోగ సమస్యపై చర్చ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు, నగర ఉపాధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు.

నేడు చెన్నూరులో కంటి వైద్య శిబిరం
కడప కల్చరల్: నగరానికి చెందిన మరియాపురంలోని మల్టీ పర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ (ఎంపీఎస్ఎస్ఎస్) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నూరులో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ తలారి బాలరాజు తెలిపారు. 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, పుష్పగిరి నేత్ర వైద్య బృందం ప్రతినిధి అమర్‌నాథరెడ్డితో కలిసి శనివారం సంస్థ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ పునీత పాల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆర్‌సీఎం చర్చి క్యాంపస్‌లో సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షల అనంతరం ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేయనున్నామన్నారు.

25న మున్సిపల్ కార్మికుల ధర్నా

మాట్లాడుతున్న కార్మిక నాయకుడు ఎస్.రవి

కడప కార్పొరేషన్: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25న నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె. తిరుపాల్, ఎస్.రవి పిలుపునిచ్చారు. స్థానిక అంధుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులను వేధిస్తున్న సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు వైద్య భత్యం ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రకాశ్, కిరణ్, ఆదాం, పుల్లయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఫీజు చెల్లించండి
పులివెందుల టౌన్ : 2024 మార్చిలో జరుగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఫెయిల్ అయిన ప్రైవేట్ విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా పరీక్షా ఫీజును చెలించాలని వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ పరీక్ష ఫీజులను వారు చదివిన కళాశాలలో చెల్లించాలని ఆయన తెలియజేశారు.

వినాయకా.. సెలవిక

శంకరాపురంలో అన్నదానం ప్రారంభించిన డిప్యూటీ సీఎం


పాత ఆర్టీసీ ఆఫీస్ వద్ద వేలంపాటలో లడ్డును దక్కించుకున్న శ్రీనివాసులు


శంకరాపురంలో వినాయకుని విగ్రహం వద్ద డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: వినాయక చవితి సందర్భంగా శంకరాపురంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద శనివారం పొట్టిపాటి జయచంద్రారెడ్డి, పి. మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితిని ప్రజలంతా ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత విగ్రహాన్ని మేళతాళాలు, బాణా సంచాల పేలుళ్ల, యువతీ, యువకుల నృత్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఉమైర్, ఉత్సవ కమిటీ సభ్యులు రామక్రిష్ణారెడ్డి, కళ్యాణ్, మను, ఓబుల్ రెడ్డి, రామక్రిష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: ఐదు రోజులపాటు పూజలందుకున్న వినాయకులను శనివారం గంగ ఒడికి చేర్చారు. మేళ తాళాలు, యువతీ, యువకుల నృత్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి కాల్వల్లో నిమజ్జనం చేశారు. నగరం లోని రాజారెడ్డి, సీయోనుపురంలో వినాయకుని లడ్డు వేలం వేయగా రూ. 85వేల ధర పలికింది. ఉత్సవ కమిటీ సభ్యులు దేవి రెడ్డి ఆదిత్య, మురళీ, శివ, ఉమ, సాయి, కార్తీక్, బుడ్డు, రాము పాల్గొన్నారు. 9వ డివిజన్ పాత ఆర్టీసీ ఆఫీసు వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డుకు వేలం పాట నిర్వహించారు. ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ కె. శ్రీనివాసులు రూ.46500కు లడ్డు సొంతం చేసుకున్నారు.

ఫ్యాప్టో నాయకుల నిరసన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ మాదన విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జీపీఎస్ విధానాన్ని అమలు చేసేందుకు ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలో బిల్లును ఆమోదించడాన్ని నిరసిస్తూ ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) పిలుపు మేరకు శనివారం కడప కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. మాదన విజయ్‌కుమార్ మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే వారంలోపే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. ఇపుడు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తామనడం తగదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాష్ భాష, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రవి కుమార్, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికొండయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, రెడ్డెన్న, మస్తాన్‌బాబు, వీరప్రతాప్, శ్రీనివాసులు, బాబు, కరీముల్లా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

29న విజయవాడలో మహా ధర్నా


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టం చేసి, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలుచేయాలని కోరుతూ ఈ నెల 29న విజయవాడలో మహా ధర్నా చేపట్టినట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితుల హక్కులు–సామాజిక న్యాయం అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల హక్కులను ప్రభుత్వాలు కాలరాయడంతో వారిలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 45 సంఘాలు కలిసికట్టుగా దళితుల అభ్యున్నతికి పని చేస్తున్నాయన్నారు. డప్పు, చర్మ కారులకు రూ. 5వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో బి.నారాయణ, చంద్రశేఖర్, వి.అన్వేష్, రామ్మోహన్, ప్రసాద్, రాము, మునెయ్య, పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి ఏపీఎస్టీఎఫ్ వినతి


అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీ ఎస్టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీపీఎస్ అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీ ఎస్టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర మాట్లాడుతూ ఎందరో ఎదురుచూస్తున్న ఓపీఎస్‌ను కాదని జీపీఎస్ అమలు చేయడం చాలా బాధాకరం అన్నారు. ఉద్యోగులకు మేలు చేసే విధంగా ఓపీఎస్ అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మదన్‌రెడ్డి, సాగర్, రవిశంకర్, చంద్రశేఖర్, నాగరాజు, ప్రసాద్, రామోహన్‌రెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీలకు బీమా అప్పగించవద్దు


660 జీవో కాపీలను దహనం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు పంటల బీమాను అప్పగించకుండా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని ఏపీ రైతు సంఘం, సీఐటియు జిల్లా కార్యదర్శులు బి దస్తగిరి రెడ్డి. మనోహర్ కోరారు. నగరంలోని పాత బస్టాండు వద్ద 660 జీవో కాపీలు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023–24 ఖరీఫ్‌లో పంటల బీమా అమలుకు ఇన్సూరెన్స్ కంపెనీలతో బిడ్డింగ్ నిర్వహించిందన్నారు. కంపెనీల ప్రవేశాలను నిలిపివేసి ప్రభుత్వమే పథకం అమలు చేయాలని కోరారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పాలసీ ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కొరకే అన్నారు. సమగ్ర పంటల బీమా పథకం తీసుకువచ్చి అన్ని పంటలకు పంటల బీమా వర్తింపజేయాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల కష్టయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, జిల్లా నాయకులు రామ్మోహన్, చంద్రారెడ్డి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఓబులేష్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


సీఎం చిత్రాన్ని వేసిన విద్యార్థి


నగర పాలక ఉర్దూ బాలికల పాఠశాలలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: నగరపాలక పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శనివారం క్లీన్ స్కూల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సోర్స్ గ్రిగేషన్, జర్నీ ఆఫ్ వేస్ట్, వేస్ట్ టు వండర్, హజార్డ్స్ ఆఫ్ ప్లాస్టిక్ తదితర అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నగరపాలక ఉర్దూ పాఠశాల విద్యార్థిని షేక్ హుమేరా సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రాన్ని చక్కగా గీసి ఆకట్టుకున్నారు. పోటీలలో విజేతలకు గాంధీ జయంతి (అక్టోబర్ 2న) నగరపాలక కమిషనర్ పురస్కారాలు, నగదు అందజేయన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సునంద

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి గర్భిణి పౌష్టికాహారం తీసుకోవాలని కడప అర్బన్ సీడీపీఓ సునంద సూచించారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా నగరంలోని ఎర్రముక్కపల్లె, నాగరాజుపేట సెక్టార్‌లో మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. బాలింతల పోషకాహారంగా ఆకుకూరలు, తృణ ధాన్యాలు తీసుకోవాలన్నారు. పోషకాల లోపం ఉంటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు వారానికోసారి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రేణుక, రెడ్డెమ్మ, అంగన్వాడీ వర్కర్లు లక్ష్మి, రమాదేవి, సుజాత, రామసుబ్బమ్మ, నాగవేణి, వినీల గ్లోరీ, సులోచన, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

ఆంగ్ల అనువాదంతో ప్రశ్నపత్రంలో తప్పులు


అధికార భాషా సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్న పత్రాలు ఆంగ్లంనుంచి తెలుగులోకి అనువాదం చేయడంతో తప్పులు వస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ద్రవిడ సురేష్ అన్నారు. తెలుగులో ప్రామాణికం చేసుకుని ప్రశ్న పత్రాలు తయారుచేయాలని కోరుతూ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. సురేష్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలకు ఇచ్చే ప్రశ్న పత్రంలో తప్పులతో తెలుగు మాధ్యమ అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడుదస్తగిరి, నగర కార్యదర్శి యస్.కె.మైనుద్దిన్ , ఉపాధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.

టెర్రస్ పంటలతో మంచి ఆరోగ్యం



నగరంలో సమావేశమైన సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్: ఇంటి పైకప్పుపై పెంచే తోటలు, సంబంధిత ఉత్పత్తులను ఆహారంలో వినియోగిస్తే ఆరోగ్యంగా ఉంటారని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సంస్థ (సీటీజీ) ప్రధాన బాధ్యులు సుష్మ తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నగరంలో ఇళ్లపై మొక్కలు, చిన్న తోటలు పెంచుతున్న వారితో ఆమె సమావేశమయ్యారు. ఇంటి పైకప్పుపై పంటల యాజమాన్యం, ఇతర విషయాలపై చర్చించుకున్నారు. అరుదైన మొక్కలను ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకొన్నారు. సూష్మ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగిన ప్రస్తుత స్థితిలో మొక్కలు నాటుకుందామనుకున్నా స్థలం లభించడం లేదన్నారు. ఇంటి పైకప్పుపై వీలైనన్ని మొక్కలు, చిరు పంటలు పెంచడమే ప్రత్యామ్నాయం అన్నారు. నాటి సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు పండించుకుని ఆహారంలో వాడితే ఆరోగ్యం లభిస్తుందన్నారు. కూరగాయలు కలుషితం చేయకుండా మన వంతు సహకారం అందించవచ్చునని తెలిపారు.

26న చేపల చెరువు వేలం పాట

చెన్నూరు : మండలంలోని రాచిన్నాయపల్లె గ్రామపంచాయతీలో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం చాపల చెరువుకు వేలం పాట వేయడం జరుగుతుందని కార్యదర్శి, సర్పంచ్ సొంతం నారాయణ రెడ్డి తెలిపారు, శనివారం వారు చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ రాచిన్నాయపల్లి గ్రామపంచాయతీలో 25 ఎకరాల 84 సెంట్ల విస్తీర్ణంలో చాపల చెరువు ఉందని, ఇందుకుగాను 2023– 24 సంవత్సరానికి సంబంధించి చాపల చెరువు వేలం పాటకు గ్రామపంచాయతీ తీర్మానం చేయడం జరిగిందన్నారు. వేలంపాటలో పాల్గొన్న తలచిన వారు గ్రామ పంచాయతీకి పదివేల రూపాయల డిపాజిట్ తీసి రసీదు పొందవలసి ఉంటుందని, అలాగే పాటదారులు రూ. 36 వేలకు పైగా ఎవరైతే పాడగలరో వారికి మాత్రమే వేలం పాట దక్కుతుందని వారు తెలియజేశారు.

దూదేకులను ముస్లింలుగా గుర్తించాలి


డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతిపత్రం సమర్పిస్తున్న దూదేకుల సంఘం సభ్యులు

కడప కల్చరల్: దూదేకుల కులస్తులను ముస్లింలుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయాలని నూర్ బాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకేసుల ఖాదర్‌బాషా కోరారు. సంస్థ సభ్యులతో కలిసి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఖాదర్‌బాషా మాట్లాడుతూ నూర్ బాషా, నద్దాఫ్ పింజారి, దూదేకుల తదితర పేర్లతో పిలువబడుతున్న తాము బీసీ–బీలో ఉంటున్న మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వారమని వివరించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి దూదేకులకు ముస్లింలుగా వచ్చేలా జీవో వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. దూదేకుల సామాజిక వర్గ పిల్లలకు విద్యాలయాల్లో ఇచ్చే టీసీలలో రెండు మతాలు చూపడంతో ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంబంధిత అధికారులకు వినతులు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గగ్గుటూరు రాజా, ఆయిల్‌మిల్ ఓబులేసు, దస్తగిరి, బాదుల్లా, పెద్దన్న, రాజు కుళాయప్ప, బాబు, బాబయ్య, సిద్దయ్య, హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వసతుల కల్పన


ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, పీఆర్ డిపార్ట్‌మెంట్ హాస్టళ్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రకాష్‌నగర్ బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వంటగది స్లాబ్‌కు మరమ్మతులు చేయించి, లైట్లు ఏర్పాటుచేయాలన్నారు. ఖాళీ స్థలంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లకు తలుపులు, తాగునీటి ఆర్వో ప్లాంట్, మోటారు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ బాలుర కళాశాల హాస్టల్‌లో డైనింగ్ రూమ్ నాణ్యతగా నిర్మించాలన్నారు. ప్రకాష్‌నగర్ బీసీ హాస్టల్‌లో కిటికీలకు మరమ్మతులు చేయించాలన్నారు. ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మణిగోపాల్‌రెడ్డి, హార్టికల్చర్ ఏడీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువులు సర్వే చేయాలి

కడప కార్పొరేషన్: నగరంలోని చెరువులను సర్వే చేసి హద్దులు గుర్తించాలని కేఎంసీ కమిషనర్ ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. ఊటుకూరు, బచ్చుంపల్లె చెరువులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ వెనుక ఖాళీ ప్రదేశంలో సర్వే చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని, విద్యార్థులు నిద్రించే గదుల్లో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, తహసీల్దార్ శివరామిరెడ్డి, డీఈ అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

గృహ సారథులకు బీమా

సమావేశంలో మేయర్ సురేష్ బాబు


మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా చేయించాలని నగర మేయర్ కె.సురేష్ బాబు కోరారు. స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్లు, కడప క్లస్టర్ కన్వీనర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీమాకు సంబంధించిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడం వెంటనే పూర్తిచేయాలన్నారు. పోలింగ్ బూత్ కన్వీనర్లను నియమించాలని, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులతో సమన్వయం చేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కె.నాగేంద్రరెడ్డి, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట: ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. రాజంపేటలోని మేడాభవన్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ , ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీడబ్ల్యూ స్కీం ద్వారా తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. చింతరాజుపల్లె సీపీడబ్ల్యూ స్కీం ద్వారా తాగునీటి సరఫరా పరిశీలన పూర్తయిందన్నారు. సిద్దవటం మండలంలోని మాధవరంలో నీటి సమస్యకు చెక్ పెట్టే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాంగోపాల్‌రెడ్డి, డీఈఈ విద్య, ఏఈ వెంకటేష్, ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ మురళీధర్ రెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జానకిరామయ్య, ఎం.బాలాజీ, రామలక్షుమ్మ, శివనారాయణ, చేవూరి సుబ్బయ్య , పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, సునీల్, లక్ష్మీనరసయ్య, పీడబ్ల్యుఎస్ స్కీం కాంట్రాక్టర్ జ్యోతి సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, సిద్దవటం, ఒంటిమిట్ట ఎస్పీడీసీఎల్ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం చెరువుకు మైలవరం నీళ్లు

పరిశీలించిన సంబటూరు ప్రసాద్‌రెడ్డి


కమలాపురం లింక్ ఛానల్‌లో మైలవరం నీటిని పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం: కమలాపురం చెరువుకు మరో రెండు రోజుల్లో మైలవరం నీళ్లు వచ్చి చేరుతాయని హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పందిళ్లపల్లె సమీపంలోని కమలాపురం లింక్ ఛానల్‌లో ప్రవహిస్తున్న మైలవరం నీటిని ఆయన డీఈఈ రంగన్న, ఏఈఈ బాబుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో కమలాపురం చెరువుకు నీరు రాలేదన్నారు. దీంతో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సూచన మేరకు మైలవరం అధికారులు దక్షిణ కాలువ ద్వారా కమలాపురం చెరువుకు 30 క్యూసెక్కుల నీళ్లు వదిలారన్నారు. ఆదివారం నుంచి మరో 40 క్యూసెక్కుల నీరు వదులుతారని, మొత్తం 70 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తారని తెలిపారు. ప్రస్తుతం ఆ నీళ్లు పందిళ్లపల్లె వద్ద ఉన్న 10.5 కి.మీ. రాయి వరకు చేరాయని, మరో రెండు రోజుల్లో కమలాపురం చెరువుకు నీరు చేరుతాయన్నారు. ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతులు రఘునాథరెడ్డి, శివకుమార్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంపై ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి

కమలాపురం : యువత దేశం పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని 30వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీలో చేరే విద్యార్థులకు ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువు, కొలతలు తీసుకుని పరుగు పోటీలు నిర్వహించారు. కాగా పోటీల్లో పాల్గొన్న వారిలో 6 మంది యువతులు, 12 మంది యువకులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లాడుతూ యువత దేశం పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు దేశానికి సేవకులు కావడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్‌సీపీ లెఫ్టినెంట్ అధికారి ప్రదీప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులంతా క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీలో శిక్షణ పొంది సీ సర్టిఫికెట్ పొంది బాధ్యాతాముతమైన పౌరులుగా ఎదగాలన్నారు. వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, పాల్గొన్నారు.